# ఇది విన్నావా, తమ్ముడూ!

"తూలికాభూషణ్"

తమ్ముడూ! ఈ వేళ నా గుండెలో ముల్లు గుచ్చుకుందోయ్. ఇది తీసివేయడానికి వీలులేదుకదా! "నీ కష్టాలవల్ల నీకు ఎక్కువ బాధ కలుగకుండా చేసుకోవాలంటే వాటిని గురించి ఎవరికీ చెప్పవ"ద్దని ఒకరన్నారు. నాలో అంతటి బలంలేదని నీకు తెలుసుకదా. ఎవరితోనైనా చెప్పుకుంటే ఈ కష్టం కొంత తీరుతుంది. ఈ బాధ కొంత శమిస్తుందని నా ఆశ. దీన్ని భ్రమకింద కట్టి నువ్వు నవ్వవని నాకు అనుభవంవల్ల తెలుసు. జీవితమంతా కష్టభూయిష్ఠమే అయిన నీకు నా బాధ అర్థం చేసుకునే శక్తి ఉంది. నిజానికి నీకొక్కడికే ఆశక్తి ఉంది. ఎంత కష్టమైనా సహించి ఇతరుల కష్టాలకు కూడా సానుభూతి చూపగలిగిన నీకు ఒక్కటి మాత్రం తెలియదు. నా బాధని నీ మీదతోసెయ్యడం నా కెంత కష్టం కలిగించగలదో నీకు అర్థం కాదు. నీవు అలాంటి పని నీ జీవితంలో చేయలేదు. అదే నాకు శరణ్యం. లేకపోతే ఇదంతా నీతో ఎలా చెప్పగలనోయ్ తమ్ముడూ!

ఇంతకీ నాకేం కష్టం కలిగిందో చెప్పకుండా ఈ సోది అంతా వెళ్ళబుచ్చుకుంటున్నానని నీకు విసుగు కలగడం లేదుకదా? దానికి నా తప్పేముంది చెప్పు. నేనెప్పుడు మాత్రం ఏ విషయం నీతో సూటిగా చెప్పాను? నిన్నూ ఎన్నెన్ని చుట్టుదారుల వెంట త్రిప్పి నీకు దారి తెలియకుండా చేయడానికి ప్రయత్నించలేదు? ఆమాటకి ఎన్నెన్ని మాయలు చేయలేదు? నిజమే చెప్పుతున్నట్లు కూడా నటించి ఎన్ని అబద్ధాలు చెప్పలేదు? నిన్నెన్ని అన్యాయాలు చేయలేదు? వాటన్నిటికి నా మీద విసుక్కున్నావా? లేదు కదూ. పైగా నా కష్టాల్ను వినడానికి ఎప్పుడూ అలాగే నడుం కట్టుకుని సిద్ధంగా ఉన్నావు. సుఖమంటే ఏమిటో ఏనాడూ తెలియకపోయినా, నా సుఖాలు గురించి కూడా విని నాతోపాటు ఆనందించావు. నా నవ్వులు పంచుకుని నాతోపాటు నవ్వుకున్నావు. నేను పెట్టిన బాధలు ఎప్పటివప్పుడే మరిచిపోయి, నాతో స్నేహంగా ఉంటూవచ్చావు. కోపం కాని, విసుగుకాని, ద్వేషంగాని, అసూయకాని లేకుండా ఇంత విపరీతమైన సహనంతో ఎలా ఉండగలుగుతున్నావు తమ్ముడూ? నువ్వు ఎంత కాలమై పుట్టావోయ్? అది నీకు తెలియదుకదూ? ఒకవేళ నాకు తెలిసినా నీకు చెప్పనని నన్ను అడగవు. అంతేకదూ? అయినా అంతటి స్వల్ప విషయం కూడా నీకు తెలియకుండా ఉండడంటే ఆశ్చర్యం ఏముందిలే? నీకు తెలియడానికి అవకాశం మాత్రం ఏముంది? తెలుసుకోవాలనే కోరికకూడా నీకు లేకపోయింది. నీవు ప్రతివిషయంలోనూ అంటే నిర్లిప్తంగా, ఉన్నదానిని సహించి, దానితో సరిపెట్టుకొని, కాలంగడపడానికే ప్రయత్నిస్తూ వచ్చావు కాని దీని కోసం మరికొంత శ్రమపడాలని అనుకో లేదు. శ్రమపడాలని అనుకున్నా నీకు తీరిక మాత్రం ఎక్కడ?

పుట్టిన నిమిషంనుంచే జీవితంతో కుస్తీ పట్టడం ప్రారంభించావు. ఎలా ప్రాణం నిలబెట్టుకున్నావో, ఎలా పెరిగావో, ఎలా పెద్ద అయ్యావో, ఎలా తిన్నావో, ఎలా బట్టకట్టావో నేను ఊహించలేను కదుటోయ్! అందుకే కాబోలు నీ జబ్బల్లో అంతబలం, నీ హృదయంలో అంత కారుణ్యం కరడు కట్టి ఉన్నాయి. అందుకనే నువ్వు ఇన్నాళ్ళూ బ్రతుకుతూవచ్చావు. అందుకే ఏ కష్టం వచ్చినా, సుఖంవచ్చినా పనితగిలినా, అవసరంవచ్చినా మేము నీ దగ్గరికే పరుగెత్తుకుని వస్తున్నాం.

ఇంతకీ ఓయి తమ్ముడూ! ఈ వేళ నా హృదయానికి ఎంత దెబ్బ తగిలిందనుకున్నావ్? అలా అంటే ఈ రోజు నేను లేచిన వేళ మంచిది కాదేమో అంటావు. నీకు తెలియదూ, నాకిలాంటివాట్లల్లో నమ్మకం లేదని? అయినా అది నీ కర్థం కాదులే. పోనీ, ఒకటి చెప్పు. అలాంటి నమ్మకాలవల్ల నీకెప్పుడు ఏం లాభం కలిగింది? రా అలారా, అసలు విషయం మాట్లాడుకుని దీని నిగ్గు తేల్చుకుందాం. అప్పుడు నీ పిల్లాడికి జబ్బు చేసింది. చుట్టుపక్కల ఎక్కడా వైద్యుడే లేడు. వైద్యుడంటే జ్ఞాపకం వచ్చింది. ఆసుపత్రుల్లో చేరినవాళ్ళు ఇంక మళ్ళీ ఇళ్ళకి రావడం లేదనే అంతా చెప్పుకునేవారు. ఆసుపత్రుల్లో మంచి మందులు ఉంటాయనీ, వైద్య సహాయం లభిస్తుందనీ అక్కడ చేరిన వాళ్ళు బాగుపడతారనీ నీకు చెప్పినవారెవరూ లేరు. ఇంక ఏం చేస్తావ్? ఊళ్ళో అమ్మవారికి కోడిపెట్ట ఇస్తానని మొక్కుకున్నావు. ఊళ్ళో తెలిసిన ఓ అయ్య దగ్గర ఇన్ని మాత్రలు తెచ్చి పిల్లాడిచేత తినిపించావ్. అదేం మాయరోగమో కాని, వచ్చిన మూడోరోజునే పిల్లాణ్ణి ఎత్తుకుపోయింది. అదేం రోగమో నీ కిప్పటికీ తెలియదుకదూ? అయినా నీ తప్పేముంది? ఆ తరువాత నీ పెళ్ళానికి కూడా జబ్బు చేస్తే, ఈ సారి చుట్టుపక్కల వాళ్ళు చెప్పారని సరాసరి అన్నవరం సత్యనారాయణస్వామివారికే మొక్కుకున్నావ్. దగ్గర్లో ఆస్పత్రులూ లేవు. డబ్బిచ్చి వైద్యుణ్ణి తెచ్చుకునే శక్తి లేదు. ఏం చేయాలో చెప్పే వాళ్ళూ లేరు. రోగాలు రాకుండాచేసుకునే సాధన సంపదా లేదు. ఇక ఏ దేవుడికైనా మొక్కుకోక చేసేదేముందని అడుగుతావా? అలా అంటే కాదు. ఇవన్నీ విడిచిపెట్టేయాలి. మారాలంటాను. నన్నెందుకిలా బాధపెడతారంటావా? ఓయ్ తమ్ముడూ, మేము నీ మానాన నిన్ను విడిచిపెట్టిందెప్పుడోయ్?

అప్పటి సంగతి నీకు జ్ఞాపకం ఉందో లేదో గుర్తుకు తెస్తాను ఉండు. అప్పుడూ అంటే, అప్పుడు దేశానికి స్వతంత్రం లేదనీ మనమంతా ఒట్టి బానిసల్లా, పురుగుల్లా, జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నామనీ, మనమంతా కట్టకట్టుకుని, స్వతంత్రం కోసం పోరాడాలనీ, ఒకవేళ మనం చచ్చిపోయినా మన తరువాతివాళ్ళకేనా స్వతంత్రం ఉంటుందనీ, వాళ్ళ జీవితాలయినా భాగ్యభోగాలతో నిండిపోతాయని నీతో చెప్పేవాళ్ళం కదూ? మా మాటలు నీకు అర్థం అయిఉండకపోవచ్చు. ఒకటిమాత్రం వెంటనే తెలిసిఉంటుందిలే. స్వతంత్రం కోసమో, మరిదేనికోసమో యుద్ధం చేయా


కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహముచ్చులు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

లంటే నీకు వెంటనే అర్థం అయి ఉంటుంది కాలగమనం తెలుసుకోడానికి, ఆఖరికి ఎవరి వయస్సయినా తెలుసుకోడానికి కూడా యుద్ధాల్ని బట్టేకదూ నువ్వు లెక్కలు కట్టుకునే వాడివి? నీకు జ్ఞానం వచ్చిన తరువాత ఒక యుద్ధం చూశావ్. మీ అయ్య రెండు యుద్ధాలు చూశాడు. అంతకుముందు మీ తాత చూచిన యుద్ధాలు లెక్కకు కూడా మించిపోతాయేమో? ఈ వేళ నువ్వు దెబ్బలాడినా, దెబ్బలాడకపోయినా యుద్ధం ఎలానూ వచ్చేస్తుంది, దాన్నెవరూ తప్పించలేరనుకున్నావ్. ఎన్ని మోసాలు, అన్యాయాలు చేసినా, ఎన్ని అబద్ధాలు చెప్పినా మా మీద ఇంకా విశ్వాసం చచ్చిపోలేదు కనుక, నలుగురితో చావు పెళ్ళితో సమాన మనుకుని, మాతో కలసి పనిచేశావు.

అంతట్లో మరో యుద్ధం రానేవచ్చింది. ఆ తరువాత స్వతంత్రం కూడా దానంతటఅదే చక్కా వచ్చింది. స్వతంత్రం వచ్చిందంటే అందరితో పాటు నువ్వు కూడా పొంగిపోయి ఉత్సవాలు చేశావ్. ఆ తరువాత మళ్ళీఎప్పటి ఆటే ప్రారంభమయింది. ఎటొచ్చీ ఒక్కటే మార్పు కనపడింది నీకు. నీ బాధలు, నీ ఇబ్బందులు, తగాదాలు, గొడవలు, అన్యాయాలు మునుపటి కన్నా ఎక్కువయ్యాయి. చివరికి తిండి బట్ట కూడా కరువై చావడానికి సిద్ధమయ్యావు. అప్పుడు నీకేం తోచి ఉంటుంది? స్వతంత్రం రాకముందే బాగా ఉండేదనికదూ? అలా అని నువ్వు బయటికి అనలేదు. అనలేకపోయావు. ఆ విధంగా తోచినదంతా బయటికి అని ఇతరులకు, అందులోనూ ఎంత దుర్మార్గులైనా నీతోటివారికి ఏ కొంచెమైనా బాధ కలిగించడం నీకు అలవాటు అయిన పని కాదు. అది కూడా సహించావు. ఏమైతేనేం, మా మీద నమ్మకం అప్పుడే నశించిపోయిందా యేం?

నీ కోసమే ఈ స్వతంత్రం తీసుకువచ్చామనీ, నువ్వు అడక్కుండానే నీకు కడుపునిండా తిండీ, కట్టడానికి బట్ట ఇస్తామంటే నీకు నవ్వు వచ్చిందా? కాని, అది నిజమే సుమా, తమ్ముడూ! ఈ మాట నమ్ము. కొద్దికాలంపాటు ఇలా కష్టంగా ఉన్నా, ఇక ముందు చాలా బాగా ఉంటుందని నేను కూడా నీతో చెబుతున్నానోయ్! అయినా ఇలా ప్రత్యేకంగా నీతో చెప్పవలసిన అవసరం మాత్రం ఏముందిలే? ఎంత కాలం నుంచో ఇలా బాధలు పడుతూ, హృదయవిదారకమైన సంఘటనలు చూస్తూ, విషాదంతో కూడిన అదే చిరునవ్వు నవ్వుకుంటూ నువ్వు ఇంకా అలాగే అంతటి సహనంతోనూ బ్రతికిఉన్నావంటే ఆ ఆశే కాదూ కారణం? ఇది నిజమే కాదూ?

నీలో ఈ ఆశాభావం చచ్చిపోకుండా ఉండేటట్లు చేయడానికి, నీ జీవితం ఎప్పటికైనా సుఖమయం అవుతుందని నచ్చ చెప్పడానికి, అందుకోసం మేమంతా ప్రాణత్యాగమైనా చెయ్యడానికి సంసిద్ధంగా ఉన్నామని నమ్మించడానికి ఎందరో ఎన్ని కథలో కావ్యాలో వ్రాశారు. చాలామంది ఆ విధంగా నిజంగానే ప్రాణత్యాగం కూడా చేశారని నేను ఎన్ని పర్యాయాలు నీతో చెప్ప లేదు? నమ్మావో లేదో కాని నవ్వి ఊరుకుంటూవచ్చావు. ఎందుకని? సత్యనారాయణస్వామి మహత్యంవల్లనో, ఆయుర్దాయం గట్టిగా ఉండడం చేతనో నీ భార్య బ్రతికింది. మొక్కుకున్న తరువాత మొక్కు తీర్చుకోక తప్పుతుందా? నీ ఆలోచనలకి, నీ చేతలకి భేదం ఏ నాడూ లేదు. నీ వెంత అమాయకుడివోయ్, తమ్ముడూ! కాలినడకనే అన్నవరం వెళ్లడానికి నిశ్చయించుకున్నావ్. అదే నీకున్న ఏకైక వాహనం. కాని, బత్తెఖర్చులికి, దేవుడికివ్వడానికి కావాలని తల తాకట్టు పెట్టినా (తాకట్టు పెట్టడానికి నీ దగ్గర మరే ముంది కనుక?) పది రూపాయలు పుట్టించలేకపోయావ్. చివరికి ఏమయింది? ఏడాదయినా తిరక్కుండా నీ భార్య కూడా పోయింది. ఆఖరికి చేసుకున్న పెళ్ళానికి మందిప్పించే సామర్థ్యం కూడా నీకు లేకపోయింది. అందుచేత నా తమ్ముడూ, నవ్వి ఊరుకున్నావ్! నువ్వు నిజంగానే ఆ కథల్ని, కావ్యాల్ని, ప్రాణత్యాగాల్ని నమ్మలేక పోయావుటోయ్!

ఈ మాటలకేంగాని తమ్ముడూ, ఇంతకీ నా హృదయానికి కలిగిన బాధగురించి చెబుతా విను. నిన్ను గురించి కథ వ్రాద్దామంటే నా కేమీ తట్టింది కాదు. వెర్రివాడా, కథ వ్రాయడానికి తగినంత విశిష్టత కాని, ప్రత్యేకతగాని, అసాధారణత్వంకాని నీ జీవితంలో ఎక్కడా గోచరించ లేదోయ్! పైగా నీలాంటివాళ్ళు ఈ ప్రపంచంలో ఎంతమంది ఉన్నారో తెలుసా? కోటానకోట్లు. సర్వ సామాన్యమైన సామాన్య మానవుడివి నువ్వు. నిన్ను గురించి వ్రాస్తే ఈ చదువుకునేవాళ్ళంతా ఏమంటారో తెలుసా? నా కేమీ తెలియదేమో, నేనాటే చదువుకున్న వాణ్ణికాదేమో అనుకుంటారు. నవ్వుతారు తమ్ముడూ. మరింకెలాగ? కథ వ్రాయక పోతే నాకు భుక్తి కూడా ఉండదు. కదా నాయనా? దానికితోడు నేను బాగా కథలు వ్రాయగలనని పదిమందిలోనూ ప్రతీతికూడా ఉందికదా? నా పరువు ఏమైనా నిలుస్తుందా చెప్పు? నా హృదయానికి కలిగిన బాధ ఇదే తమ్ముడూ!

అదృష్టవశాత్తూ ఇదేదీ నీకు అర్థంకాదు. లేకపోతే ఇలా చెప్పగలిగేవాణ్ణా? అయితే ఏం? అంతమాత్రంచేత పోయేదేమీ లేదు. కేవలం నా హృదయానికి బాధకలిగిందన్న విషయం మాత్రం నువ్వు ఎంతో సులభంగా అర్థంచేసుకోగలవు. నీ హృదయం ప్రేమమయం నాకు సానుభూతి చూపిస్తావుకదూ? ★

